సాక్షి
కర్నూలు
గురువారం। 5। అక్టోబర్। 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



8న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): పగిడ్యాల జెడ్పీ హైస్కూల్ మైదానంలో జూనియర్ స్థాయి ఖోఖో జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 8న నిర్వహించనున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులు.



'ఓటు'పాట్లు లేకుండా..

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు, ప్రాంతాలు, పేర్ల మార్పుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. 8లో▸

న్యూస్‌రీల్

6న ఆలూరులో 'స్పందన-జగనన్నకు చెబుదాం'

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన సమక్షంలో ఉదయం 10 గంటలకు స్పందన–జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయి కార్యక్రమం కావడంతో అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. అందువల్ల నియోజకవర్గంలోని మండలస్థాయి అధికారులు ఆయా శాఖల రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్వో సస్పెన్షన్

నందవరం: మండలంలోని నాగలదిన్నె వీఆర్వో వీరేష్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సృజన బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిత్యానందరాజు మాట్లాడుతూ జగనన్న భూ హక్కు–భూరక్ష పథకంలో భాగంగా సమగ్ర రీ సర్వే విధులను నిర్లక్ష్యం చేయడం, వీడియో కాన్ఫరెన్స్‌లకు గైర్హాజరు అవుతుండటంతో కలెక్టర్ సస్పెండ్ చేశారన్నారు.

'ఈ-కేవైసీ'కి ప్రత్యేక స్లాట్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ-కేవైసీలో సర్వర్ సమస్యలను అధిగమించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక స్లాట్‌ను అమలులోకి తెచ్చింది. ఉదయం 6 గంటల నుంచి 2 గంటల 13 జిల్లాల్లో, మిగిలిన 13 జిల్లాలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు స్లాట్ ఇచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రైతులతో ఈ-కేవైసీ చేయించాల్సి ఉంది. స్లాట్ ఇవ్వడంతో సర్వర్‌పై ఒత్తిడి తగ్గుతుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఈ నెల 8వ తేదీలోపు వీఏఏ, వీఆర్‌వో అథెంటికేషన్, రైతుల ఈ-కేవైసీతో సహా మొత్తం ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తదుపరి రబీ పంటల నమోదు కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు.

కాన్వొకేషన్ దరఖాస్తుకు నేడు ఆఖరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాల్గవ కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గురువారం వరకు గడువు ఉందని వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. సాంకేతిక సమస్యలు ఉంటే సాయంత్రం 5 గంటల్లోపు వర్సిటీ అధికారులను సంప్రదించాలన్నారు.

ముఖ గుర్తింపు ద్వారా పింఛను

కర్నూలు(అగ్రికల్చర్): 60 ఏళ్లు పైబడి వేలిముద్రలు, ఐరిష్ నమోదు కాని పింఛనుదారులు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను తీసుకోవచ్చని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నాగశివలీల తెలిపారు. ఇతర కేటగిరీలకు చెందిన పింఛనుదారులు విధిగా మూడు సార్లు వేలిముద్రలు, ఐరిష్ నమోదుకు ప్రయత్నం చేయాలన్నారు. మూడు సార్లు కూడా ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,47,021 పింఛన్లు ఉండగా 2,42,413 మందికి పింఛన్లు అందించారు. 98.13 శాతం పంపిణీ పూర్తయింది.
- నంద్యాల జిల్లాలో 2,23,210 పింఛన్లు ఉండగా 2,19,382 పింఛన్లు పంపిణీ చేశారు. 98.29 శాతం పూర్తయింది.
- ఇప్పటి వరకు పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 9, నంద్యాల జిల్లా 6వ స్థానంలో నిలిచాయి.

మునిసిపాలిటీల్లో రోజుకు నాలుగు క్యాంపులు

కర్నూలు(సెంట్రల్): ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మునిసిపాలిటీల్లో రోజుకు నాలుగు వార్డుల్లో జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపులు నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలతో జగనన్న ఆరోగ్య సురక్ష, రీసర్వే, హౌసింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపులను ప్రజలకు అనువుగా నిర్వహించాలన్నారు. క్యాంపు నిర్వహణ విషయాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంతమంది రోగులు వచ్చినా టోకెన్లు ఇవ్వాలని, అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూథింగ్, ఎల్‌పీఎం జనరేషన్ పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపని గోనెగండ్ల హౌసింగ్ ఏఈపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెరిగిన నికరాదాయం



తోటలో పండిన చీనీ కాయలను చూపుతున్న ఈ రైతు పేరు బలరాముడు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన సన్నకారు రైతు. ఈయన 2018 వరకు వేరుశనగ, పత్తి తదితర పంటలు సాగు చేస్తూ వచ్చారు. కరువు నేపథ్యంలో సరిగ్గా పంటలు పండేవి కాదు. రేయింబవళ్లు కష్టించినా అందుకు తగినట్లు ఆదాయం వచ్చేది కాదు. దీంతో 2019లో పండ్లతోటల వైపు మళ్లారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నాలుగు ఎకరాల్లో చీనీ సాగు చేశారు. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ఎప్పటికప్పుడు నిర్వహణ బిల్లులు ఇవ్వడం బాగా కలసి వచ్చింది. చీనీ తోట నుంచి ఏడాదికి రూ.3.20 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

కలసి వచ్చిన జామ సాగు



జామ పండ్లను చూపుతున్న ఈ రైతుపేరు కె. రాముడు, ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామానికి చెందిన చిన్నకారు రైతు. తనకు 5 ఎకరాల పొలం ఉండగా అందులో 1.37 ఎకరాల్లో జామ తోటను 2019లో అభివృద్ధి చేసుకున్నారు. రెండేళ్లుగా జామ కాపునకు వస్తోంది. 2019 వరకు పచ్చి మిరప, టమాట సాగు చేసేవారు. వర్షాభావ పరిస్థితులతో అరకొరగా దిగుబడులు వచ్చేవి. నికరాదాయం రూ.20 వేలకు మించేది కాదు. ఉపాధి నిధులతో జామ తోట అభివృద్ధి చేసుకోవడంతో అన్ని ఖర్చులు పోను ఏటా రూ.1.40 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికేడాది దిగుబడులు పెరుగుతుండటంతో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. పండ్లతోటల అభివృద్ధితో ఈ రైతు నిశ్చింతగా ఉంటున్నారు.

ఉపాధి నిధులతో 2019-20 నుంచి అభివృద్ధి చెందిన పండ్లతోటల వివరాలు..		
సంవత్సరం	లబ్ధి పొందిన రైతులు	వృద్ధి చెందిన పండ్లతోటలు (ఎకరాల్లో)
2019-20	1,126	2,353
2020-21	1,396	2,826
2021-22	1,721	3,348
2022-23	1,533	2,628
2023-24	4,397	7,577
మొత్తం	10,173	18,732

తోటలు తియ్యగా.. జీవితాలు పండగా!

- 'ఉపాధి' నిధులతో పండ్ల తోటల అభివృద్ధి
- ఐదేళ్లలో 18,752 ఎకరాల్లో పండ్లతోటల విస్తరణ
- 10,173 మంది సన్న, చిన్న కారు రైతుల జీవితాల్లో వెలుగులు
- 2018-19తో పోలిస్తే 2023-24లో రెట్టింపు కంటే ఎక్కువగా ఉత్పాదకత
- డ్రాగన్‌ఫ్రూట్స్‌తో పాటు అన్ని రకాల పండ్లతోటల అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు



ఉపాధి నిధులతో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోట



తోటలో నాటిన మామిడి మొక్కలు

సబ్సిడీల వివరాలు..	
తోట	మూడేళ్లలో ఇచ్చే సబ్సిడీ
మామిడి	రూ.1,03,193
జామ	రూ.1,27,451
తైవాన్ జామ	రూ.2,26,783
డ్రాగన్‌ఫ్రూట్	రూ.1,84,533
దానిమ్మ	రూ.2,44,819
సీతాఫలం	రూ.1,82,840
చీని	రూ.1,07,459

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. చిన్న, సన్నకారు రైతులు స్థిరాస్తిని అభివృద్ధి చేసుకుని సమాజంలో గౌరవప్రదంగా జీవనం సాగించే అవకాశాన్ని కల్పిస్తోంది. వంద శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. జిల్లాలో మామిడి, చీని, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్ తోటల సాగు పెరుగుతోంది. 2022 నుంచి 'ఉపాధి' నిధులతో మునగసాగును ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది.

గతంలో ఇలా..

టీడీపీ హయాంలో జిల్లాలో 2014 నుంచి 2019 ఏప్రిల్ వరకు కరువు తాండవించింది. రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. పండ్లతోటల అభివృద్ధి నామమాత్రానికే పరిమితం అయ్యింది. 'ఉపాధి' నిధులను టీడీపీ నాయకులు, వారి అనుయాయులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 20 శాతం నిధులు ఖర్చు చేసి 80 శాతం నిధులు మింగేశారనే విమర్శలు వచ్చాయి. పండ్లతోటలు అభివృద్ధి చెందకపోవడం, చిన్న, సన్న రైతుల జీవితాల్లో ప్రగతి కనిపించకపోవడం ఈ విమర్శలకు బలాన్ని చేకూర్చాయి.

వైఎస్సార్‌సీపీ వచ్చిన తర్వాత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2019 నుంచి పండ్లతోటల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. పండ్లతోటల అభివృద్ధికి 100 శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019-20 నుంచి 2023-24 వరకు రికార్డు స్థాయిలో 18,732 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి జరిగింది. పండ్లతోటలు విస్తరించడంతో ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. 2018-19 నాటికి పండ్లతోటల నుంచి దాదాపు 5 లక్షల టన్నుల ఉత్పాదకత ఉండగా... 2023-24లో ఉత్పాదకత 11 లక్షల టన్నులకు పెరిగింది. 'ఉపాధి' నిధులతో డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు అవకాశం ఇచ్చింది. బావులు, బోర్లు లేకపోయినప్పటికీ పండ్ల మొక్కలు నాటుకొని సమీపంలోని చెరువులు, కాల్వల నుంచి నీళ్లు తెచ్చుకొని కాపాడుకునే అవకాశాన్ని (డ్రైల్యాండ్ హార్టికల్చర్) కల్పించింది. దీంతో జిల్లాలో పెద్ద ఎత్తున పండ్లతోటల అభివృద్ధికి అవకాశం ఏర్పడింది.

రైతుల జీవితాల్లో వెలుగులు

టీడీపీ హయాంలో కరువు కోరల్లో చిక్కుకొని చిక్కిశల్యమైన రైతులు.. నేడు పండ్లతోటల సాగులో అద్భుతంగా రాణిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2019-20 నుంచి 2023-24 వరకు ఐదేళ్లలో 10,173 మంది రైతులు పండ్లతోటలను అభివృద్ధి చేసుకున్నారు. వీరందరూ సన్న, చిన్నకారు రైతులే. కరువుకోరల్లో చిక్కి నలిగిన వారే. పండ్లతోటల అభివృద్ధితో వీరి జీవితాల్లో వెలుగులు పరుచుకున్నాయి. 2019-20లో పండ్లతోటల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కొన్ని పండ్ల తోటలు 2021-22 నుంచే ఫలాలను ఇస్తున్నాయి. పండ్లతోటల్లో అంతరపంటలు కూడా సాగు చేసుకుంటూ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారు. అసైన్డ్ భూముల్లో సైతం పండ్లతోటలను అభివృద్ధి చేసుకున్నారు. 2023-24లోనే 4397 మంది రైతులు పండ్ల తోటల వైపు దృష్టి సారించారు. ఒక్క ఏడాదిలోనే 7577 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చెందడం విశేషం.

ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం



పండ్లతోటల అభివృద్ధితో కరువును శాశ్వతంగా నివారించవచ్చు. ఉపాధి నిధులతో కరువు నుంచి బయట పడే విధంగా పండ్లతోటల అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నాం. 2023-24లో పండ్లతోటలకు మరింత ఆదరణ పెరిగింది. ఎకరాకు మూడేళ్లలో సగటున రూ. లక్ష వరకు సబ్సిడీ లభిస్తోంది. అన్ని రకాల పండ్లతోటలతో పాటు గులాబీ, మల్లె, మునగ తోటల అభివృద్ధికి అవకాశం కల్పిస్తున్నాం. పండ్లతోటల అభివృద్ధితో జిల్లా నుంచి వలసలు కూడా తగ్గుముఖం పట్టాయి.

– అమరనాథరెడ్డి,, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

మిల్లెట్ యూనిట్‌తో రైతుల ఇంట 'సిరి'



కలెక్టరేట్‌లో మోడల్ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే సుధాకర్

- ఆదోని మండలం చిన్నపెండేకల్‌లో ఏర్పాటు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్
- కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, రైతులు

కర్నూలు(సెంట్రల్): సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో చిరు(సిరి)ధాన్యాలు పండించే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో ఒకేసారి 13 సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా కర్నూలు జిల్లా ఆదోని మండలం చిన్న పెండేకల్‌లో రూ.4.41 కోట్లతో ఏర్పాటు చేయనున్న యూనిట్ కూడా ఉంది. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్, జేసీ నారపురెడ్డి మౌర్య, పలువురు రైతులు వీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో మోడల్ సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తొలిసారి సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ యూనిట్ ద్వారా కొర్రలు, జొన్నలు, సజ్జలను పౌడర్ చేసి మిల్లెట్ ఫ్లోర్, బిస్కెట్లు, మిల్లెట్ ఫ్లేక్స్, వర్మీసెల్లి, న్యూడిల్స్ తదితర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి, మార్కెటింగ్ చేయవచ్చన్నారు. ఈ యూనిట్ ద్వారా చిరుధాన్యాల సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. వెనుకబడిన ఆదోని ప్రాంతంలో ఆహార ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభపరిణామన్నారు. ఈ యూనిట్ రైతులకు మేలు చేస్తుందని, ప్రజలకు ఆరోగ్యపరంగా కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ మాట్లాడుతూ.. అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, జిల్లా వ్యవసాయధికారి వరలక్ష్మి, జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి రామచంద్రయ్య, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు ఎంతో మేలు



రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదోని ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే మేం పండించే జొన్నలు, రాగులు, కొర్రలకు మంచి రేటు వస్తుంది. చిరుధాన్యాల సాగు రైతుకు లాభసాటిగా మారుతుంది.

– పెద్ద సోమన్న, చిన్న పెండేకల్, ఆదోని మండలం

గిట్టుబాటు ధర లభిస్తుంది



ఇప్పుడిప్పుడే రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెంచుకుంటున్నారు. పంటలు పండించిన తరువాత వాటిని మార్కెట్లో అమ్ముకోవడం ఇబ్బందిగా మారింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తే గిట్టుబాటు ధర లభిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుకు మేలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

– కొట్టయ్య, చిన్నపెండేకల్, ఆదోని మండలం

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- ప్రభుత్వం చేసిన మేలును వివరించండి
- మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎల్ కన్వీనర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. నాలుగేళ్ల ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు ఉన్న ఊరిలోనే సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతోపాటు తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఒక్కరోజు గ్రామ సచివాలయంలో రాత్రి బస చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు రంగమ్మ, ఉమాదేవి, హేమలత, నెట్టకంటమ్మ, లక్ష్మిదేవి, షేకున్‌బీ, జెడ్పీటీసీ సభ్యులు ఏరూరు శేఖర్, దొరబాబు, కిట్టు, పార్టీ మండలాధ్యక్షులు వీరేష్, మారయ్య, భీమప్ప, పెద్దయ్య, షఫిఉల్లా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం



ఓర్వకల్లు సమీపంలోని వైఎస్సార్-జగనన్న కాలనీలో 1.5 సెంట్ల స్థలంలో నిర్మితమైన ఇల్లు

కలల సౌధం

సెంటు స్థలంలో సమాధులు మాత్రమే కట్టుకోగలరనే టీడీపీ నేతల విమర్శలపై నిలిచిన కలల సౌధం ఇది. రెక్కలు ముక్కలు చేసుకొని, పైసా పైసా కూడబెట్టుకున్నా సొంతిల్లు కలగానే మిగిలిపోతున్న రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊళ్లకు ఊళ్లనే నిర్మిస్తున్నారు. వెంచర్లను తలదన్నే రీతిలో కాలనీలను తీర్చిదిద్దుతున్నారు. సకల సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న ఇళ్లు, సరికొత్త ఊళ్లను చూసి టీడీపీ నేతల కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా తలెత్తుకు నిల్చొన్న ఇళ్లకు ఆర్చీ అదనపు సొబగులు అద్దుతుండగా.. ఇంటింటికీ విద్యుత్ కనెక్షన్, నీటి వసతి, రోడ్లు, డ్రెయినేజీ.. ఒక్కటేమిటి, అన్ని హంగులతో ఓర్వకల్లు సమీపంలోని వైఎస్సార్–జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి శరవేగంగా ముస్తాబవుతోంది.

- మరిన్ని చిత్రాలు 8లో▸

క్లుప్తంగా

అడిగిన వారందరికీ 'ఉపాధి'



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ద్వారా ఉపాధి హామీ పథకం కింద పని కలి ్పస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద గతంలో జరిగిన పనులు, వేతనాలు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ.. ఏడాదికి 100 రోజుల పాటు పనిదినాలు కల్పిస్తామని, సగటున రోజువారీ వేతనం రూ.272 లభిస్తుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా ఆరు నెలలు మిగిలి ఉందని, కూలీలు మిగిలిన పనిదినాలు ఉపయోగించుకోవాలని కోరారు. గాంధీ జయంతి నుంచి 2024–25 సంవత్సరానికి ఉపాధి పనులను గ్రామసభల ద్వారా గుర్తించే ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైందన్నారు. సర్పంచ్ ముత్యాల శైలజ, ఏపీఓ రాజునాయక్, ఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ టీవీ, కెమెరా అమరిక, రిపేరిలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు సీసీ టీవీ, కెమెరా అమరిక, రిపేరీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 13 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువకులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



ఆహ్లాదాన్ని పంచే హాల్



విశాలమైన పడక గది



సౌకర్యవంతంగా వంట గది



ఆధునిక మరుగుదొడ్డి



కరెంట్ సౌకర్యం కల్పిస్తున్న విద్యుత్ సిబ్బంది



దాహార్తి తీరుస్తున్న మంచినీటి ట్యాంకులు



నిర్మాణంలో జగనన్న కాలనీ ముఖద్వారం



అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఇల్లు

పేదల గూడు.. ఇదిగో చూడు

పేదల సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా పక్కా గృహాలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి మూడు విడతల్లో రూ.1.80 లక్షలను ఇస్తోంది. డబ్బులు లేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రూ. 35 వేలు రుణం ఇప్పిస్తోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను రాయితీపై అందజేస్తోంది. అంతే కాకుండా కాలనీల్లో విద్యుత్, రోడ్లు, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. దీంతో లబ్ధిదారులు రెట్టింపు ఉత్సాహంతో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఓర్వకల్లు సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలోని పేదల ఇళ్లు ఇవీ..

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



అందంగా రూపుదిద్దుకున్న ఇంటికి అమర్చిన విద్యుత్ మీటరు



విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసిన దృశ్యం



ఓర్వకల్లు సమీపంలోని 14 ఎకరాల్లో 260 ఇళ్లతో ఏర్పడిన జగనన్న కాలనీ

విత్తనోత్పత్తి మరింత పెంచేందుకు చర్యలు

- వ్యవసాయ శాఖ అడిషినల్ డైరెక్టర్ వినయ్‌చంద్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖకు సంబంధించిన ఫామ్‌ల్లో భూములను పూర్తిగా వినియోగంలోకి తెచ్చి విత్తనోత్పత్తిని మరింత పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ అడిషినల్ డైరెక్టర్ వినయ్‌చంద్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న ఫామ్‌లను పరిశీలించేందుకు అడిషినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ పంపారు. ఈ బృంద సభ్యులు బుధవారం జూపాడుబంగ్లా మండలం తంగడంచె, ఎమ్మిగనూరు ఫామ్‌లను పరిశీలించారు. మధ్యాహ్నం కర్నూలు డీఏవో కార్యాలయాన్ని సందర్శించి, ఫామ్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషినల్ డైరెక్టర్ వినయ్‌చంద్ మాట్లాడుతూ... తంగడంచె ఫామ్‌లో 215 ఎకరాల్లోనే విత్తనోత్పత్తి జరుగుతోందని, 300 ఎకరాల్లో ఎలాంటి సాగు లేదన్నారు. సాగులో లేని భూమిని వినియోగంలోకి తెచ్చి విత్తనోత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎమ్మిగనూరు ఫామ్‌లోని 50 ఎకరాల్లో విత్తనోత్పత్తి సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. తంగడంచె ఫామ్‌లోని భూములపై కమిషనర్‌కు సవివరమైన నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ జేడీఏ కృపాదాస్, డీఏవో పీఎల్ వరలక్ష్మి, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఎమ్మిగనూరు ఫామ్ ఏడీఏ ప్రవీణ్ పాల్గొన్నారు.



ఫామ్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ అదనపు డైరెక్టర్ వినయ్‌చంద్ తదితరులు

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

ఆలూరు: తల్లిదండ్రులు లేని అనాథ చిన్నారులకు జేసీఎల్ జిల్లా కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి రూ. 10 ఆర్థిక సాయాన్ని అందజేశారు. హాలహర్వి మండలం బాపురం గ్రామానికి చెందిన దంపతులు మంజునాథ్‌స్వామి, శారదమ్మ ఏడాది క్రితం మృతిచెందారు. వారి పిల్లలు గణేష్, పూజిత అనాథులుగా మిగిలారు. ప్రస్తుతం గణేష్ హాలహర్వి జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి, పూజిత బాపురం గ్రామంలో 7వ తరగతి చదువుతోంది. వీరికి తల్లిదండ్రులు నుంచి, దయాదుల నుంచి ఎలాంటి ఆస్తిపాస్తులు రాలేదు. గ్రామస్తుల సహకారంతో వారు పెరుగుతున్నారు. ఈ విషయం తెలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు, జిల్లా జేసీఎల్ కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి బాపురం గ్రామానికి వచ్చి చిన్నారులు గణేష్, పూజితకు రూ 10 వేలు ఆర్థిక సాయం చేశారు. వీరి చదువుకు భరోసా కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జేసీఎల్ జిల్లా కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలో ఈనెల 5న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలను బుధవారం అధికారులు ప్రకటించారు.

మండలం	శిబిరం ఏర్పాటయ్యే ప్రాంతం
ఎమ్మిగనూరు	లక్ష్మీ పేట యూపీహెచ్‌సీ
ఎమ్మిగనూరు	కె.తిమ్మాపురం
వెల్దుర్తి	మల్లేపల్లి
తుగ్గలి	పెండేకల్
పెద్దకడుబూరు	హనుమాపురం
పత్తికొండ	పోతిరాళ్ల
ఓర్వకల్లు	నన్నూరు-3
నందవరం	టి.సోమలగూడూరు-2
మంత్రాలయం	బూదూరు
మద్దికెర	బురుజుల
కర్నూలు	స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ
కర్నూలు	నందనపల్లె
కృష్ణగిరి	తల్లగోకులపాడు
కౌతాళం	తోవి
కోడుమూరు	కోడుమూరు-4
కర్నూలు మండలం	పునులూరు
హాలహర్వి	గూళ్యం -3
గూడూరు	హరిజనవాడ యూపీహెచ్‌సీ
గోనెగండ్ల	హెచ్.కైరవాడ-1
దేవనకొండ	అలారుదిన్నె
చిప్పగిరి	రామదుర్గం
సి.బెళగల్	పోలకల్-2
ఆస్పరి	ములుగుందం-2
ఆదోని	ఇందిరానగర్ యూపీహెచ్‌సీ
ఆదోని	నారాయణపురం

అత్యాధునిక టెక్నాలజీతో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

- 24వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా టెలికాం జీఎం రమేష్

కర్నూలు(రాజ్‌విహార్): అత్యాధునిక టెక్నాలజీతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ భవన్‌లో 24వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాలు చూడకుండా అతి తక్కువ ధరకే బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు అందిస్తోందన్నారు. త్వరలోనే స్వదేశీ టెక్నాలజీతో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీతో భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీసు అందిస్తున్నట్లు చెప్పారు. మారుమూల ప్రాంతాలకు సేవలందించాలనే లక్ష్యంతో కేవలం రూ.399లకే 30 ఎంబీపీఎస్ స్పీడుతో అపరిమితమైన ఇంటర్నెట్, పట్టణ వాసులకు రూ.449కే అందిస్తామన్నారు. ఇటీవలే కొత్తగా ఐపీ టీవీ సర్వీసులు ప్రారంభించామని, ఒకే ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్, వైఫై, టెలిఫోన్, టీవీ సర్వీసులను పొందవచ్చన్నారు. కేవలం రూ.329లకే ఈ ప్యాకేజీ వర్తిస్తుందన్నారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ సేవలు పొందుతున్న వినియోగదారులు తమ సిమ్‌లను 4జీగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం స్మార్ట్ లర్నింగ్ యూజింగ్ బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ అనే అంశంపై నిర్వహించిన చిత్ర లేఖనంలో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందించారు. మొదటి స్థానం సాధించిన కర్నూలు శ్రీలక్ష్మి హైస్కూల్ విద్యార్థిని జి.ప్రణితకు రూ.599 ప్లాన్ ఏడాది పాటు ఉచితంగా, ద్వితీయ స్థానంలో నిలిచిన సిస్టర్ స్టాన్సిలాస్ విద్యార్థిని ఎం.సహనకి ఆరు నెలలు, మూడవ స్థానం దక్కించుకున్న శ్రీచైతన్య విద్యార్థిని కె.హర్షితకి మూడు నెలలు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎం సాయినాథ్, ఏజీఎంలు వెంకటరాములు, శ్రీను నాయక్, మురళీకృష్ణ, వి.జాన్సన్, నారాయణ స్వామి పాల్గొన్నారు.



విజేతలతో బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్

ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన(ఏ గ్రూపు అయినా) మహిళలకు రెండు సంవత్సరాల ఉచిత మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్/ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ కళాశాల కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మొత్తం సీట్లు 40 ఉన్నాయని, ప్రవేశం పొందాలనుకునే మహిళలు 2023 డిసెంబర్ 31వ తేది నాటికి 17 సంవత్సరాల వయస్సు నిండి 30 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ htt p://cfw.ap.nic.in నుంచి పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31లోగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు 9848352725, 7416404740 నెంబర్లను సంప్రదించాలన్నారు.

'ఓటు' పాట్లు లేకుండా..

- పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ
- కొత్త కేంద్రాల ఏర్పాటు.. పలు కేంద్రాల పేరు మార్పు
- కుటుంబంలో అందరూ ఒకే చోట ఓటు వేసేలా చర్యలు

కర్నూలు(సెంట్రల్): ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒక పోలింగ్ కేంద్రంలో కనీసం 900 మంది , అత్యధికంగా 1,500 మంది లోపు ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇదులో భాగంగా జిల్లాలో కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 2,184 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కర్నూలులో 258, పాణ్యంలో 339, పత్తికొండలో 255, కోడుమూరులో 275, ఎమ్మిగనూరులో 271, మంత్రాలయంలో 236, ఆదోనిలో 256, ఆలూరులో 294 చొప్పున ఉన్నాయి. ఎన్నికల సంఘం నూతన నిబంధనలు ప్రకారం కల్లూరు, కోసిగి మండలం కోనమాన్ పేటలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. పోలింగ్ స్టేషన్లు ఉండే ప్రాంతాన్ని మార్చేందుకు 114, కేంద్రాల పేరు మార్పుపై 328 ప్రతిపాదనలు వచ్చాయి. పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలలు అప్‌గ్రేడ్ కావడంతో వాటి పేర్ల మార్పు కోసం ప్రతిపాదించాల్సి వచ్చింది. పోలింగ్ స్టేషన్ల విలీనానికి జిల్లాలో ఎక్కడా ప్రతిపాదనలు రాలేదు.

అన్ని రకాల సదుపాయాలు

పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్టోబర్ చివరి నాటికి నాడు–నేడు పనులు పూర్తయ్యే పాఠశాలలనే పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. పోలింగ్ స్టేషన్లను మ్యాపింగ్ చేస్తున్నారు. దీంతో ఓటరు నేరుగా తన సెల్ ఫోన్‌లోని గూగుల్ మ్యాప్ ద్వారా సులభంగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. కేంద్రంలోకి ప్రవేశించిన తరువాత కూడా ఎక్కడా ఎలాంటి అయోమయం లేకుండా లోపలికి, బయటకు వచ్చు మార్గాలను చూపుతూ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దాని నంబరు, పేరు, పీఎస్ ఆఫీసర్ పేరు రాయించేలా చర్యలు తీసుకుంటున్నారు. కుటుంబసభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఓటరుజాబితా రూపకల్పన నుంచి పోలింగ్ కేంద్రం కేటాయించే వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలి

బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓలు) సమర్థవంతంగా విధులు నిర్వహించి తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై ఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. తగిన డాక్యుమెంట్లు ఉంటనే ఫారం -6,7,8లను డిస్పోజ్ చేయాలన్నారు. చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రం, జాబితాలో కొత్తగా ఓటరుగా చేరాలంటే బర్త్ సర్టిఫికెట్ ఉంటాలన్నారు. జిల్లాకు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు వచ్చినట్లు చెప్పారు. వాటిని ప్రస్తుతం స్కానింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఈనెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు వాటిని ఫస్టు లెవల్ చెక్ నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడును ఇన్‌చార్జిగా నియమించినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదనరావు, ఈఆర్‌ఓ రమ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపాం

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై దృష్టి సారించాం. జిల్లాలో కొత్తగా రెండు పోలింగ్ స్టేషన్లకు ప్రతిపాదించాం. పోలింగ్ స్టేషన్ల లోకేన్లు, పేర్లు మార్పులపై కూడా పెద్ద ఎత్తున ప్రతిపాదనలు వచ్చాయి. వాటిన్నింటినీ పరిశీలించి ఎన్నికల సంఘానికి పంపుతాం. – డాక్టర్ జి.సృజన, కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి